# మహాలయ



## డా॥ మైలవరపు శ్రీనివాసరావు

'అబ్దం' అనే మాటకి సంవత్సరమని అర్థం. అలా తండ్రీ లేదా తల్లీ పోయిన తిథి ఏదో గమనించుకుని సరిగా ఆ మాసంలో, ఆ పక్షంలో, ఆ తిథి రోజున అబ్దం(సంవత్సరం) నిండిన రోజున నిర్వహించుకునే శ్రద్ధాపూర్వకమైన కార్యక్రమాల్ని(శ్రాద్ధాన్ని)ఆబ్దికం అంటారు. ఇదిప్రతి సంవత్సరమూ ఆ నెలలో, ఆ పక్షంలో, ఆ తిథినాడేచేయబడుతూ ఉంటుంది కాబట్టి దీన్ని ప్రత్యాబ్దికం (ప్రతి అబ్దం చివరాచేయబడేది) అంటారు.ఇది మొదటిది. తీర్థ శ్రాద్ధమనేది రెండవది. ఏదైనా ఓ ప్రసిద్ధమైన దేవాలయం ఉండి,దాని పక్కనుండి ప్రవహించే జీవనది (ఎప్పుడూ ఎండిపోని ప్రవాహం)గాని ఉంటేదాన్ని తీర్థక్షేత్రమని అంటారు. అలాటి తీర్థ ప్రదేశంలోచేయబడే శ్రాద్ధాన్ని తీర్థశ్రాద్ధమంటారు.

ఉదాహరణకి గయలో, ప్రయాగలో, గుజరాత్‌లోని మాతృగయ (సిద్ధపూర్)లో శ్రీశైలం,కాశీవంటి ప్రదేశాల్లో చేయబడేవన్నీ తీర్థ శ్రాద్ధాలే.ఇక ప్రతి 12 సంవత్సరాలకీ ఓసారి వచ్చే పుష్కరాల సమయంలోచేయబడే శ్రాద్ధాలని పుష్కరశ్రాద్ధాలు అంటారు.ఇది దాదాపుగా ఎందరికో తెలిసినదీ, అనుభవంలో కన్పించినదీను. ఇది మూడవ తీరు శ్రాద్ధవిధి.

ఇలా కాక ప్రతి ఆరునెలలకీ వచ్చే సంక్రమణాలకి అంటే దక్షిణాయనం (జూలై 16), ఉత్తరాయణం (జనవరి 14)- వీటినే కర్కాటక సంక్రమణం, మకర సంక్రమణం (సంక్రాంతి) అంటాం కదా!- రోజున శ్రాద్ధాన్ని పెట్టడం ఓ ఆచారంగా ఉంది. దాన్ని సంక్రమణ శ్రాద్ధమంటారు. దీన్నే ఎందరో 'పెద్దలకి పెట్టుకోవడ'మని వ్యవహరిస్తూ గతించిన తమ పెద్దలందరికీ పిండివంటలతోపాటు ఆహారపదా ర్థాలని సూర్యసాక్షిగా భక్తితో నివే దనచేస్తుంటారు. ఇది నాల్గవ శ్రాద్ధవిధి. ఇది నిజం కాబట్టే సంక్రాంతి పండుగలోని చివరిరోజైన కనుమ(కనుమ సరికాదు) నాడు ఉత్సాహంగా గారెలని నివేదిస్తుంటారు.

ఇక ఆశ్వయుజంలో వచ్చే అమావాస్య రోజుకూడా లక్ష్మీపూజతోపాటు శ్రద్ధతో పెద్దలకిపెట్టుకునే విధానం ఒకటుంది. ఇది ఐదవది. క్రమంగా శ్రద్ధాభక్తులు లోపిస్తున్న కారణంగా ఈ చెప్పబడిన పద్ధతుల్లో కొన్ని చిత్రంగా అన్పించవచ్చు. ఇన్ని తీరుల శ్రాద్ధ పద్ధతులుండగా మళ్ళీ మహాలయ శ్రాద్ధమనేదిదేనికి? అనే సంశయం కలుగుతుందెవరికైనా.

### మహాలయం ప్రత్యేకత

ప్రతి సంవత్సరంలోనూ భాద్రపదమాసంలో పూర్ణిమ వెళ్ళిన మరురోజునుండి అంటే బహుళ పాడ్యమి (ఈ సంవత్సరంలోనైతే సెప్టెంబరు 30) నుండి అమావాస్య (అక్టోబరు 14) వరకూ ఉన్న బహుళ పక్షాల్ని (15 రోజుల్నీ) మహాలయ పక్షంగా పెద్దలు తెలియజేశారు.

పితృదేవతలైనవారంతా తమ తమకి చెందినవారి నుండి శ్రద్ధా భక్తుల్ని ఆపేక్షిస్తూ తమ వాళ్ళకి ఆశీర్వచనాలని అందించడానికి సిద్ధంగా ఉంటారట ఈ 15 రోజులపాటూ.అందుకే ఈ మహాలయపక్షం 15 రోజుల్లోనూ-తన తండ్రీ లేదా తన తల్లీ ఏ సంవత్సరం, ఏ మాసం, ఏ పక్షంలో గతించినా-ఆ గతించిన నాటి తిథిని మాత్రమే ప్రమాణంగా తీసుకుని ఆ తిథి నాడే మహాలయ శ్రాద్ధాన్ని (తిథి,నక్షత్ర వారేషు తిథిరేవ గరీయసీ) నిర్వహించుకుంటారు. మరి తండ్రి ఒక తిథినాడూ,తల్లి మరొక తిథినాడూ గనుక గతించి ఉంటేనో? అప్పుడు ఆ ఇద్దరిలో ఏ ఒకరి తిథినో ప్రమాణంగా చేసుకుని ఆనాడు నిర్వహించడం సరైన పని. ఇక వృత్తి, ఉద్యోగ, వ్యాపార, ఇతర బాధ్యతల కారణంగా గనుక అది సాధ్యపడనట్లయితే, మహాలయపక్షంలోనిచివరిరోజైన అమావాస్యనాడు ఇద్దరికీ పెట్టితీరాలంది- పెట్టుకోవచ్చునంది శాస్త్రం.

### మరి కొన్ని విశేషాలు

మహా+లయమనే పదానికి గొప్ప వినాశన కాలమనేది పైఅర్థం. స్కాందపురాణంలో చెప్పబడినదాన్ని బట్టి దుర్వార్తలకి అనుకూలమైన కాలమని అర్థం.ఉత్తరాయణమంతా దేవతలకాలమైతే దక్షిణాయనమనేది పితృదేవతల కాలం.

తల్లిదండ్రులు (మాతా చ పితా చ పితరౌ) పితృదేవతలుగా తాము గతించిన పిమ్మట అవుతారు. వాళ్ళు ఏవైనా మహాదోషాలు గనుక తెలిసో, తెలియకో చేసి ఉంటే ఆ దోషాల ప్రభావం తమ సంతతిమీదపడుతుందని ఈ ధర్మశాస్త్ర శ్లోకం చెప్తోంది.

**యది నాత్మని పుత్రేషు న చేత్పుత్రేషు నప్తృషు।**
**నత్వేవ తు కృతో ధర్మః కర్తుర్భవతి నిష్ఫలః॥**

ఆ కారణంగానే వయసులో భార్యా లేదా భర్త గతించడం, అకారణ నిందలూ, అవమానాలూ, సంతానం లేకపోవడం...వంటివొస్తాయి.

ఆ కారణంగా ఈ పక్షాల్లో (15 రోజుల్లో) మనోమయరూపంతో భూమిని చేరుకుని ఇక్కడే ఈ 15

# పక్షాలా! ఏమిటి? ఎందుకు?



రోజులపాటూ ఉండే వీరికి శ్రాద్ధాన్ని నిర్వహిస్తే వాళ్ళు మనకి కష్టాలని రాకుండానూ వచ్చి ఉంటే తొలిగి పోయేందుకూ, రాబోతుంటే వాటిని తప్పించేందుకూ తగిన కృషిచేస్తారట. ఆత్మ అనేది శరీరాన్ని విడిచి వెళ్ళాక అంశ రూపంతో భూపర్యటన చేసేది ఈ కాలంలోనే. ఈ 15 రోజుల్లోనూ ఏ తిథినాడు శ్రాద్ధాన్ని పెడితే ఏ ప్రయోజనం వుంటుందో ఆ విశేషాలని తెలుసుకున్న కొందరు పెద్దలు తమకున్నంతలోనే 15 రోజులపాటూ మహాలయ శ్రాద్ధాన్ని పెడతారు.

## అందరి పేరిటా...

ప్రతి సంవత్సరమూ చేసే శ్రాద్ధాల్లో ఎవరిది ఆ ఆబ్దికమో వారికి మాత్రమే పిండాలని సమర్పిస్తారు. అయితే మహాలయంలోనూ, తీర్థ శ్రాద్ధాల్లోనూ మొత్తం ఎందరున్నారో అందరికీ పిండాలని సమర్పిస్తారు. ఆ క్రమం ఇదుగో!

**ఆదౌ పితా తథా మాతా సాపత్నీజననీ తథా...**
**శ్వశుర శ్యాలకశ్చైవ స్వామినో గురు శిక్షితః॥**

తండ్రి, తాత, ముత్తాత, తల్లి, ఆమె అత్త, ఆమెకి అత్త, సవతి తల్లి, తల్లి తండ్రి, తల్లి తాత, తల్లి ముత్తాత, అమ్మమ్మ, తల్లికి బామ్మ, తల్లికి ముత్తమ్మ, సొంత భార్య, కొడుకు, చిన్నతమ్ముడు, బాబాయి, పెదనాన్న, మేనమామ కుమార్తె, తోబుట్టువు కూతురి కొడుకు, మేనల్లుడు, మేనత్త, పిన్ని, పెద్దమ్మ, అల్లుడు, బావ, కోడలు, మామ, అత్త, బావమరిది, ప్రభువు, గురువు ధనమిచ్చి శ్రేయస్సుకోరిన వ్యక్తి...ఇందరికి పిండాలని ఓ క్రమపద్ధతిలో సమర్పిస్తారు.

ఒక్కసారి పరిశీలించి చూసుకుంటే ఎందరి పేర్లు, గోత్రాలు ఎందరికో తెలియవనే మాట యథార్థం. ఇందరి వివరాలూ తెలుసుకోగలగడం ఇందరితోనూ రాకపోకలు కలిగి ఉండడం అవసరమని గుర్తుచేస్తుంది మహాలయం- అయితే గతించిన పక్షంలోనే వీరంద రికీ పిండాలని సమర్పించాలి. నాకు నా తండ్రి లేదా తల్లి లేదా ఆ ఇరువురూ ఏ సహాయాన్నీ, ప్రేమనీ, బాగోగుల్నీ చూడ(నే)లేదు కాబట్టి నేను శ్రాద్ధాలనే పెట్టను- మహాలయం కూడానా? అనకూడదు.

వాళ్ళు నిన్ను పట్టించుకోకపోయి ఉండచ్చుగాక! నువ్వు చేయకపోతే ఆ పిండాలని పెట్టని తప్పు నీ మీదపడి నీ సంతతికిపైన చెప్పుకున్న కష్టాలు లభించే అవకాశముందని మర్చిపోకూడదు.

## మూఢవిశ్వాసం కాదు

**రా**మచంద్రుని దగ్గరికి భరతుడొచ్చి చెప్పేవరకూ రామునికి తన తండ్రి మరణవార్త తెలియదు.

నిజానికి రామునికి ఆ వార్త తెలిసేనాటికి తన తండ్రికి ఉత్తరక్రియలు చేయాల్సిన కాలం దాటి పోయింది. అయినా రాముడు ఆ వార్తని విన్న క్షణం లోనే నది ఒడ్డుకి వెళ్ళాడు.

**ఇంగుదం బదరైర్మిశ్రం పిణ్యాకం దర్భసంస్తరే।**
**న్యస్య రామ స్సుదుః ఖార్తః రుదన్వచన మబ్రవీత్॥**

అక్కడ తనకి లభించిన తెలకపిండి, గారపిండి, రేగుపండ్ల మిశ్రమంతోనే పిండాలనిచేసి సమర్పిస్తూ బోరున ఏడ్చాడని శ్రీమద్రామాయణం చెప్తోంది. కొన్ని కొన్ని విదేశప్రాంతాల్లో ఉన్నవాళ్ళకి ఈ శ్రాద్ధాన్ని పెట్టడానిక్కావలసిన పదార్థాలూ, వరి, అన్నమూ దొరక్కపోవచ్చు. **'యదన్నం పురుషో భుంక్తే తదన్నం తస్యదేవతాః'** ఏది తాను తింటూ ఉన్నాడో దాన్నే పిండాలుగా చేసి నివేదించవచ్చునంది శాస్త్రం.

ధృతరాష్ట్రుడు తన పిల్లలు నూరుగురికీ తనకి రిక్థి (తన పుత్రుని శ్రేయస్సుకోసం తపించినవాడు) అయిన కర్ణునికీకూడా పిండప్రదానాన్ని చేశాడు. తాను చేసిన ఘోరమైన నేరాల కారణంగానే తాను జీవించి ఉండి పుత్రులకి పిండాలు పెట్టుకోవలసినవాడ య్యాడు. గతించిన తల్లిదండ్రులు లేదా ఏ ఒకరో దేవలోకానికి వెళ్ళి ఉంటే వాళ్ళకి ఈ పిండం అమృత రూపంగానూ, మనుష్యరూపంలోనే ఉంటే అన్నం గానూ, పశువైనట్లైతేగడ్డిగానూ, పామైనట్లైతే వాయువు గానూ, రాక్షసుడయ్యుంటే మాంసంగానూ ప్రేతగానే ఉండి ఉన్నట్లైతే రక్తరూపంగానూ చేరుతుందిట.

కంచికామకోటి పరమాచార్యులవారు చెప్పిన ప్రకారం- మనం పంపిన భారతదేశపు నగదు తమ పిల్లలు ఏ దేశంలో ఉంటే ఆ దేశపు నగదుగా చెల్లింప బడ్డట్టు ఈ పిండం వృథా కాదు- వాళ్ళకి చెందిన ప్రయోజనాత్మక ద్రవ్యంగా వెళ్తుందిట.

## పాత్తర్లు కాదు-పత్రాలు

**శ్రా**ద్ధంరోజున పొత్తర్లు ఇవ్వడం ఆచారంగా ఉంది. ఒకప్పటి రోజుల్లో శ్రాద్ధంనాడియ్యవలసిన పిండిముద్దల్నీ, బియ్యం, పప్పు, కూరా, చింతపండూ, మొదలైన ద్రవ్యాలని వేటికి వాటిని వేరుచేసి పత్రాల్లో (ఆకుల్లో) ఇస్తూండేవారు.

ఆ పత్రాలని ఇయ్యడమనే ఆచారమే నేటికీ సాగుతూ ఉన్న పత్రాలనేమాట కాస్తా పాత్రాలు పొత్త ర్లుగా మారింది తప్ప క్రియమాత్రం ఒకటే.

ఏ విధంగానూ శ్రాద్ధాన్ని నిర్వహించలేని నికృష్ట స్థితిలో (భార్యా అననుకూలత తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితంకావడం) ఉంటే నిర్జనవనానికి వెళ్ళి లేదా మధ్యాహ్న సూర్యుణ్ణి దర్శిస్తూనెత్తిని బాదు కుంటూ- పితృదేవతలారా! ఇటువంటి పుత్రుణ్ణి అయినందుకు తీవ్రంగా చింతిస్తున్నాను- అంటూ తనని తాను వాయురూపంలో ఉన్న పితృదేవతలని తలుచు కుంటూ తిట్టుకోవాలి.